5

సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు పి.గణపతి రూ. లక్ష (ఏలూరు), కొత్తపల్లి నాగదార లక్ష్మీతేజ(కైకలూరు) రూ.1,01,116 విరాళంగా అందజేశారు.



రూ.50,111 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ముదపాక పవన్‌కుమార్ (హైదరాబాద్) శనివారం రూ.50,111 విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజి నుంచి శనివారం తూర్పు డెల్టా కాలువకు 800, మధ్య డెల్టాకు 50 ,పశ్చిమ డెల్టాకు 2500 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద 6.05 అడుగులకు నీటి మట్టం చేరింది.

న్యూస్‌రీల్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



తాండవపల్లి లే అవుట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. హౌసింగ్ డేను పురస్కరించుకుని తాండవపల్లి-5, 6, రూరల్ లే అవుట్లను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తాండవపల్లి-6 లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని అన్నారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన నీటి వసతి, అప్రోచ్ రోడ్లు, విద్యుత్ కనెక్షన్ల పనులను సకాలంలో చేపట్టాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. తాండవపల్లి-5 లే అవుట్‌లో మట్టి ఫిల్లింగ్ పూర్తయిన చోట్ల పంచాయతీరాజ్ అధికారులు అప్రోచ్ రోడ్లు వేసిన వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని చెప్పారు. గతంలో తాండవపల్లి-5 లే అవుట్‌లో ఐదు అప్రోచ్ రోడ్లు నిర్మించామని, మిగిలిన లే అవుట్‌లో అప్రోచ్ రోడ్లను మున్సిపల్ అధికారులు వేయాలని సూచించారు. సైట్ ఫిల్లింగ్ అనంతరం లబ్ధిదారులను చైతన్యపరిచి, ఇళ్లు మంజూరు చేస్తూ, స్టేజ్ కన్వర్షన్ ద్వారా త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్లను ఆదేశించారు. డ్రైన్లు నిర్మించాలని గ్రామస్తులు, రైతులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ చేపట్టాలని డ్రైనేజీ విభాగం ఇంజినీర్లను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజినీర్ పీఎస్ రాజకుమార్, గృహ నిర్మాణ సంస్థ ఈఈ శ్రీనివాస్, డీఈఈ దార ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, ఎంపీడీఓ కాశీ విజయప్రసాద్, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి పాల్గొన్నారు.

నేటి నుంచి డెల్టా కాలువలకు నీటి సరఫరా నిలిపివేత

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం నుంచి నీటి సరఫరాను నిలిపివేయనున్నారు. గత ఏడాది నవంబర్ 30న రబీ సీజన్ ప్రారంభమైంది. వాస్తవానికి మార్చి నెలాఖరుతో కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు నీటి సరఫరాను నిలిపివేయాల్సి ఉంది. కొన్నిచోట్ల సాగు పూర్తి కాకపోవడంతో ఇప్పటి వరకూ నీటి విడుదలను పొడిగిస్తూ వచ్చారు. రబీలో 8,96,533 ఎకరాలకు గానూ 94 టీఎంసీలు విడుదల చేస్తామని తొలుత అధికారులు ప్రకటించారు. మధ్యలో నీటి ఎద్దడి వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సీలేరు అధికారులతో మాట్లాడి, విద్యుత్ ఉత్పత్తితో సంబంధం లేకుండా బైపాస్ ద్వారా నీటిని విడుదల చేయించింది. దీంతో ఆయకట్టు పూర్తి స్థాయిలో గట్టెక్కింది. ఇప్పటి వరకూ బ్యారేజీ నుంచి 93.38 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సీలేరు నుంచి 49.78 క్యూసెక్కుల నీరు బ్యారేజీకి వచ్చి చేరింది. సమష్టి కృషితోనే రబీని విజయవంతంగా గట్టెక్కించగలిగామని ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.శ్రీనివాసరావు వెల్లడించారు.

వాడపల్లి వెంకన్నకు తొలి జీతం విరాళం



చైర్మన్ రమేష్‌రాజుకు చెక్కు అందిస్తున్న రాధాకృష్ణ

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి రావులపాలెం మండలం పొడగట్లపల్లి ఉప్పలపాటి జానికమ్మ అన్నదాన సత్రం ఈఓ మీసాల రాధాకృష్ణ తన తొలి జీతం రూ.79,685 విరాళంగా సమర్పించారు. వాడపల్లి ఆలయంలో పర్యవేక్షకునిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన ఇటీవల పదోన్నతిపై ఈఓగా పొడగట్లపల్లి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఈఓగా తన తొలి జీతాన్ని స్వామి వారికి చెక్కు రూపంలో ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు చేతుల మీదుగా అందజేశారు.

విజేఈఈ కేతనం

- జేఈఈ మెయిన్స్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విద్యార్థుల ప్రతిభ
- మెరుగైన ర్యాంకులతో ముందంజ
- విజేతల ఇంట వెల్లివిరిసిన ఆనందం



రాజమహేంద్రవరం రూరల్/అమలాపురం టౌన్/ పి.గన్నవరం: ఐఐటీ, ఎన్ఐటీలు, జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు. ఇక్కడ చదవడం అంటే తమ కల నెరవేరినట్టేనని విద్యార్థులు భావిస్తారు. ఇందుకోసం పదో తరగతి నుంచే పట్టుదలతో శ్రమిస్తారు. ఇంటర్మీడియెట్‌కు చేరగానే పూర్తిగా దీనిపైనే ఫోకస్ పెడతారు. అహరహం కష్టపడతారు. విద్యా సంస్థలు కూడా ఈ దిశగానే సాన పెడతాయి. ఇందుకు ప్రధాన ద్వారం జేఈఈ మెయిన్స్. ఇందులో మెరుగైన ర్యాంకు వచ్చిన వారందరూ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాస్తారు. ఇక్కడ ఉత్తమ ర్యాంకు వచ్చిన వారు దేశంలోని వివిధ ఐఐటీలలో అడ్మిషన్లు పొందుతారు. మెయిన్స్‌లో మంచి ర్యాంకు వచ్చిన వారు ఎన్ఐటీలలో సీట్ల కోసం పోటీ పడతారు. తాజాగా శనివారం జేఈఈ మెయిన్స్ ర్యాంకులు వెలువడ్డాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఎక్కువ మంది ఇందులో ప్రతిభ చాటుకున్నారు. ర్యాంకులు పొందిన విద్యార్థుల ఇంట ఆనందం వెల్లివిరిసింది. వీరిని విద్యా సంస్థల యాజమాన్యాలు అభినందించాయి. ఉత్తమ ర్యాంకులు సాధించిన కొందరు విద్యార్థుల గురించి పరికిస్తే..

విద్యార్థి పేరు: కాళ్లకూరి సాయినాథ్ శ్రీమంత్



ర్యాంక్: జనరల్ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 10
తల్లిదండ్రులు: తండ్రి చిన సుబ్బారావు, వ్యాపారి, తల్లి సత్యకుమారి గృహిణి.
లక్ష్యం: ముంబాయి ఐఐటీలో సీటు
ఊరు: దుడ్డివారి అగ్రహారం, అమలాపురం

విద్యార్థి పేరు: కొమరపు వివేక్‌వర్ధన్



ర్యాంక్: ఓపెన్ కేటగిరిలో 62
తల్లిదండ్రులు: తండ్రి గోపీగోవర్ధన్ ప్రభుత్వ టీచర్. తల్లి ప్రసూన ప్రైవేట్ టీచర్.
లక్ష్యం: ముంబయి ఐఐటీలో సీటు.
ఊరు: నల్లజర్ల (తూర్పు గోదావరి)

విద్యార్థి పేరు: గ్రంధి వంశీ ఎస్‌జీఎన్ వర్షిత్



ర్యాంక్: ఓపెన్ కేటగిరీలో 163
తల్లిదండ్రులు: తండ్రి గ్రంధి రవిప్రకాష్ వ్యాపారి, తల్లి కమల గృహిణి.
లక్ష్యం: టాప్ ఐఐటీలో సీటు.
ఊరు: రాజమహేంద్రవరం

విద్యార్థి పేరు: రావూరి అఖిల్



ర్యాంక్: ఓపెన్ కేటగిరీలో 389
తల్లిదండ్రులు: తండ్రి రావూరి గంగాధరం, బ్యాంకు ఉద్యోగి, తల్లి హైమావతి, గృహిణి.
లక్ష్యం: స్పేస్ రీసెర్చ్ చేయాలని..
ఊరు: కొత్తపేట (కోనసీమ జిల్లా)

విద్యార్థి పేరు: పల్లంపాని శ్రీజ



ర్యాంక్: ఓపెన్ కేటగిరీలో 399
తల్లిదండ్రులు: తండ్రి శ్రీరామచంద్రమూర్తి, చిరు వ్యాపారి, తల్లి సూర్య కామాక్షమ్మ గృహిణి.
లక్ష్యం: టాప్ ఐఐటీలో సీటు.
ఊరు: రాజమహేంద్రవరం

విద్యార్థి పేరు: కర్రి గంగాధనశ్రీ



ర్యాంక్: ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 111
తల్లిదండ్రులు: తండ్రి రామచంద్రారెడ్డి, ఫైనాన్స్ వ్యాపారి, తల్లి చంద్రాలక్ష్మి, గృహిణి.
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.
ఊరు: పొలమూరు, అనపర్తి మండలం

విద్యార్థి పేరు: బుడిం మనోజ్



ర్యాంక్: ఓపెన్ కేటగిరీలో 1167
తల్లిదండ్రులు: బుడిం త్రిమూర్తులు ప్రభుత్వ టీచర్, తల్లి మహాలక్ష్మి, గృహిణి.
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ కంపెనీ నెలకొల్పడం.
ఊరు: కొత్తపేట (కోనసీమ జిల్లా)

విద్యార్థి పేరు: శేరు జ్యోతిక



ర్యాంక్: ఓబీసీ కేటగిరీలో 466, ఆలిండియా 2,569
తల్లిదండ్రులు: తండ్రి కుమార్, తల్లి వరలక్ష్మి
లక్ష్యం: ఐఐటీలో కంప్యూటర్ సైన్స్
ఊరు: కె.ఏనుగుపల్లి, పి.గన్నవరం మండలం

విద్యార్థి పేరు: రెడ్డి శివప్రజిత్



ర్యాంక్: ఓపెన్ కేటగిరీలో 1423
తల్లిదండ్రులు: తండ్రి రెడ్డి రాంకుమార్ రైతు, తల్లి అమరావతి, గృహిణి.
లక్ష్యం: టాప్ ఐఐటీలో సీటు
ఊరు: మండపేట (కోనసీమ జిల్లా)

విద్యార్థి పేరు: వి.భార్గవకృష్ణ



ర్యాంక్: ఓబీసీ కేటగిరీలో 252
తల్లిదండ్రులు: తండ్రి వానపల్లి వీరబ్రహ్మం (టీచర్), తల్లి హైమావతి, గృహిణి.
లక్ష్యం: బెంగళూరు ఐఐఎస్‌సీలో సీటు.
ఊరు: మండపేట

విలువలకు నిలువెత్తు నిదర్శనం చిట్టబ్బాయి

రెండో వర్ధంతి సభలో మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: రాజీ లేని తత్వంతో రాజకీయ విలువలకు నిలువెత్తు నిదర్శంగా కుడుపూడి చిట్టబ్బాయి నేటికీ జిల్లా ప్రజల హృదయాల్లో నిలిచారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, పార్టీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తొలి అధ్యక్షుడు కుడుపూడి చిట్టబ్బాయి రెండో వర్ధంతి సభ స్థానిక హైస్కూల్ సెంటరులో శనివారం జరిగింది. అక్కడి చిట్టబ్బాయి విగ్రహానికి మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి తదితరులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అక్కడే ఉన్న మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి, మాజీ మంత్రి కుడుపూడి ప్రభాకరరావు విగ్రహాలకు కూడా వారు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. తనతో పాటు తొలిసారి ఎమ్మెల్యే అయిన ఎంతో మంది గుండెల్లో చిట్టబ్బాయి గురుతుల్యులుగా నిలిచిపోయారని పి.గన్నవరం ఎమ్మెల్యే చిట్టిబాబు అన్నారు. ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్ మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలో చిట్టబ్బాయి పార్టీ పటిష్టతకు చిట్టబ్బాయి నాటిన బీజాలే నేడు మహావృక్షంగా బలోపేతమైందని అన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, సెంట్రల్ డెల్టా బోర్డ్ చైర్మన్ కుడుపూడి బాబు, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామగోపాల్, గెడ్డం సంపదరావు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి మునికుమారి, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, చిట్టబ్బాయి కుమారుడు, పార్టీ నేత కుడుపూడి భరత్ భూషణ్, మున్సిపల్ కౌన్సిలర్లు చిట్టబ్బాయి సేవలను కొనియాడారు.



చిట్టబ్బాయి వర్ధంతి కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్, ఎమ్మెల్యే చిట్టిబాబు

జగన్ పాలనకు జనం జేజేలు

- మెగా పీపుల్స్ సర్వేకు విశేష స్పందన
- ప్రజల సంపూర్ణ మద్దతు
- ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనకు జనం జేజేలు పలుకుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ‘జగనన్నే మా భవిష్యత్’ కార్యక్రమంలో భాగంగా పార్టీ చేపట్టిన మెగా పీపుల్స్ సర్వేలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు లభిస్తోందని చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, ‘జగనన్నే మా నమ్మకం’ అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ఎంతో విశ్వాసం ప్రకటిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం తమకేమీ చేయలేదన్న విషయాన్ని ప్రజలే స్పష్టం చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 1.40 కోట్ల ఇళ్లను సందర్శించామని, సుమారు 1.10 కోట్ల మంది మిస్డ్ కాల్ ఇచ్చి సీఎం జగన్ ప్రభుత్వానికి మద్దతు పలికారని పొన్నాడ చెప్పారు. రెండోసారి కూడా జగన్ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలోనే వైఎస్సార్ సీపీ పాలనకు మద్దతు తెలియజేయడంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు జరిగిన మేలును వివరించి, వారిని వైఎస్సార్ సీపీ వైపు ఆకర్షించేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. విద్య, వైద్య రంగాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, ఆయనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని నూరు శాతం ప్రజలు అభిప్రాయపడ్డారని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, రైతులు, మహిళల నుంచి పూర్తి మద్దతు లభిస్తోందన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో 70 శాతం మంది ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలిపారని పొన్నాడ చెప్పారు. విలేకర్ల సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

అంబేడ్కర్ ఆలోచనలతో అసమానతలకు చరమగీతం



సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

రాజోలు: తన ఆలోచనలతో సమాజంలోని అసమానతలకు అంబేడ్కర్ చరమగీతం పలికారని ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు శ్రీ డీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల, రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఆధ్వర్యాన ‘డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ - గొప్ప మానవతావాది’ అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించారు. రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబా అధ్యక్షతన శనివారం జరిగిన ఈ సెమినార్‌లో ప్రొఫెసర్ హరగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన చదువుతోనే సాధ్యమని, తద్వారా సమాజంలో మార్పులు వస్తాయని అన్నారు. సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగించేందుకు అంబేడ్కర్ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. మహిళలు చదువుకోవాలని, వారికి ఆస్తిహక్కు కల్పించాలని సూచించారన్నారు. వితంతువులపై వివక్షను అంబేడ్కర్ రూపుమాపారని చెప్పారు. సమాజాభివృద్ధి కోసం కుల వివక్షను సమూలంగా రూపుమాపేలా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలకొల్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన బాలబాలాజీ సన్నిధి

మామిడికుదురు: అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి ఆలయం శనివారం కిటకిటలాడింది. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ బాలబాలాజీ స్వామి వారిని దర్శించుకున్నారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1.38 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలుగా రూ.54,161 కలిపి దేవస్థానానికి రూ.1.92 లక్షల ఆదాయం సమకూరింది. స్వామి వారిని 2,894 మంది భక్తులు దర్శించుకున్నారు. 2,365 మంది అన్న ప్రసాదం స్వీకరించారు.

క్లుప్తంగా

కూచిపూడి నృత్యంలో డిప్లొమా కోర్సు ప్రారంభం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య అశోక్

రాజానగరం: కూచిపూడి నృత్యంలో కొత్తగా ప్రవేశపెట్టిన పార్ట్‌టైమ్ డిప్లొమా కోర్సును ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ శనివారం ప్రారంభించారు. కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఆధ్వర్యాన నిర్వహించే ఈ కోర్సు బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. కళలు, సంస్కృతికి రాజధానిగా పేరొందిన రాజమహేంద్రవరంలోని తమ వర్సిటీలో ఈ కోర్సును ప్రారంభించడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, ఈసీ సభ్యుడు ఆచార్య కేఎస్ రమేష్, డాక్టర్ పి.విజయనిర్మల, డాన్స్ కోర్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రాజరాజేశ్వరీదేవి, ఆచార్య డి.జ్యోతిర్మయి, డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎ.మట్టారెడ్డి, డాక్టర్ కె.నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

వేద పఠనంతో ప్రకృతి ప్రసన్నం



ప్రసంగిస్తున్న వేద పండితుడు శ్రీరామశర్మ

అంబాజీపేట: ప్రకృతిని శాసించడం ఎవ్వరివల్లా కాదని ప్రముఖ వేద పండితుడు చిర్రావూరి శ్రీరామశర్మ అన్నారు. శ్రీ గోదావరి మండల వేద శాస్త్ర ప్రవర్ధక సభ చారిటబుల్ ట్రస్ట్ 72వ వార్షికోత్సవం సందర్భంగా తొండవరంలో మూడు రోజుల పాటు వేద విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. చివరి రోజు జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీరామశర్మ మాట్లాడుతూ, వేద పఠనంతో ప్రకృతిని ప్రసన్నం చేసుకోవచ్చని చెప్పారు. గ్రామానికి చెందిన ఆకెళ్ళ సూర్యనారాయణ అవధాని (మేఘనాథ్) ఆధ్వర్యాన నిర్వహించిన ఈ వేద పరీక్షలకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 250 మంది హాజరయ్యారు. పరీక్షాధికారులుగా కడియాల వెంకట సీతారామ ఘనపాఠి, తంగిరాల సుబ్రహ్మణ్యశర్మ అవధాని, చింతా చలపతిశర్మ, ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. 33 మంది విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. మిగిలిన విద్యార్థుల వేద విద్య వివిధ దశల్లో ఉందని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టావఝుల సూర్యనారాయణమూర్తి, ఆకెళ్ల వెంకట కృష్ణ కామేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

వరాల దేవుడే.. వరుడయ్యే వేళ..

- నేటి నుంచి సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు
- నేడు వధూవరుల అలంకరణ
- ముస్తాబయిన రత్నగిరి



కల్యాణ వేదికను అలంకరిస్తున్న దృశ్యం



పుష్పాలంకరణకు జరుగుతున్న ఏర్పాట్లు

అన్నవరం: భక్తుల పాలిట కొంగుబంగారంగా ఖ్యాతికెక్కిన సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. సోమవారం రాత్రి 9 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించనున్నారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని రత్నగిరి సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. వరాలిచ్చే సత్యదేవుడే వరునిగా, దేవేరి శ్రీ అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు వధువుగా దర్శనమిచ్చే శుభతరుణం రానే వచ్చింది. అమ్మవారిని, స్వామి వారిని వధూవరులుగా అలంకరించే వేడుక ఆదివారం సాయంత్రం 4 గంటలకు రత్నగిరిపై కన్నుల పండువగా జరగనుంది. ముత్తయిదువలు పసుపు దంచి, శుభం కోరే ఈ వేడుక కోసం దేవస్థానంలోని అనివేటి మండపంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. వధూవరుల అలంకరణ అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తారు. రాత్రి 7 గంటలకు కళావేదిక మీద స్వామి, అమ్మవార్లకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. సత్యదేవుని కల్యాణోత్సవాలకు రత్నగిరి క్షేత్రపాలకులు శ్రీ సీతారాములు పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తారు. ఈ నేపథ్యంలో రాత్రి 9 గంటలకు సీతారాములను వెండి ఆంజనేయ వాహనంపై ఊరేగిస్తారు. సత్యదేవుని కల్యాణోత్సవానికి తరలి రావాల్సిందిగా భక్తులను, గ్రామస్తులను ఈ సందర్భంగా ఆహ్వానించనున్నారు.

రూ.కోటితో ఏర్పాట్లు

సత్యదేవుని కల్యాణ మహోత్సవాలకు రూ.కోటి వరకూ ఖర్చు చేస్తున్నారు. ఇందులో విద్యుద్దీపాలంకరణకు రూ.25 లక్షలు, పుష్పాలంకరణకు రూ.15 లక్షలు ఖర్చు చేస్తున్నారు. మిగిలిన మొత్తాన్ని భద్రతా ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు., ఊరేగింపులు, వైదిక కార్యక్రమాలకు కేటాయించారు. ఇప్పటికే విద్యుద్దీపాలంకరణ దాదాపు పూర్తి కాగా.. ఆలయ ప్రాంగణం, అనివేటి మండపం, కల్యాణ వేదిక, వేదిక ముందున్న విశ్రాంతి మండపాన్ని పుష్పమాలికలతో అలంకరిస్తున్నారు. రత్నగిరి రామాలయం పక్కన ఉన్న వేదికపై సత్యదేవుని దివ్య కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఈ వేదికను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. వేదిక సమీపాన ఉన్నవారితో పాటు దూరంగా ఉన్నవారు కూడా తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వెనుక వైపు నుంచి కూడా కల్యాణం తిలకించేలా స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. కల్యాణ వేదికకు ఎడమ వైపు ఉన్న వేగిళ్ళ వాటర్ ప్లాంట్‌ను పాత గెస్ట్ హౌస్ స్థలంలోకి మార్చడంతో ఏర్పడిన ఖాళీ స్థలాన్ని చదును చేశారు. అక్కడి నుంచి కూడా స్వామివారి కల్యాణం తిలకించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్కడి నుంచి దక్షిణం వైపు చూస్తే అన్నవరం ఊరంతా కనిపిస్తుంది. దీంతో కల్యాణ వేడుకల అనంతరం ఇక్కడ సిమెంటు బెంచీలు వేసి వ్యూ పాయింట్‌గా మార్చాలని అధికారులు యోచిస్తున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో తిరుమల ప్రభంజనం



ర్యాంకర్లతో నున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: జేఈఈ మెయిన్స్‌లో తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరీల్లో తమ విద్యార్థులు కె.వివేక్ వర్ధన్ 2, పి.శ్రీజ 29, వి.నందినీదుర్గ 32, డి.యువాన్ గేట్స్ 46, జీడీపీ ఎస్ఎస్ శరణ్ 47, ఎం.రాహుల్ 74, ఎల్‌డీ వర్ధన్ 81, ఎస్‌వీ సహాని 96, కేజీ శ్రీధనశ్రీ 111, వీఎస్ఎస్ తేజస్విని 145, జీవీఎస్‌జీఎస్ వర్షిత్ 163, ఎస్.సుష్మ 189, సీహెచ్ రాజీవ్ లోచన్ 192 ర్యాంకులు సాధించారని వివరించారు. 500 లోపు 33 మంది, 1,000 లోపు 51 మంది, 5,000 లోపు 190 మంది, 10,000 లోపు 319 మంది, 20,000 లోపు 515 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. కోచింగ్ తీసుకున్న విద్యార్థుల్లో 1,248 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత పొంది, 95.8 శాతం సక్సెస్ రేటు సాధించారని చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను నున్న తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి శనివారం అభినందించారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

రూ.15 లక్షల సొత్తు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సొత్తు, నిందితులతో ఇన్‌స్పెక్టర్ విజయకుమార్

రాజమహేంద్రవరం రూరల్: చోరీ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి, భారీగా సొత్తు స్వాధీనం చేసుకున్నారు. బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. హుకుంపేట సావిత్రి నగర్‌లో ఉంటున్న ద్వారంపూడి రామచంద్రరావు ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు ఈ నెల 18వ తేదీన అర్ధరాత్రి ఆ ఇంట్లోకి చొరబడి, భారీగా బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు చోరీ చేశారు. సేఫ్ లాకర్‌లో ఉంచిన 6 జతల బంగారు చెవి దిద్దులు, 3 నెక్లెస్‌లు, 3 చైన్లు, నల్లపూసల గొలుసు, 10 ఉంగరాలు, బంగారు లక్ష్మీదేవి కాసులు, ముక్కుపుడక, మరో చిన్న గొలుసు, సుమారు 2 కేజీల బరువైన 3 వెండి పళ్లాలు, అష్టలక్ష్మి చెంబు, వెండి లక్ష్మీదేవి విగ్రహం, 5 వెండి కుందులు, 3 వెండి గిన్నెలు, ఒక వెండి గ్లాసు, 3 జతల వెండి పట్టీలు, వెండి గంధపు గిన్నె, 2 వెండి కుంకుమ భరిణెలు, రూ.75 వేల నగదు అపహరించుకుపోయారు. బాధితుడు రామచంద్రరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏఎస్పీ (క్రైం) జి.వెంకటేశ్వరరావు సూచనలతో, ఈస్ట్‌జోన్ డీఎస్పీ ఎం.భక్తవత్సలం పర్యవేక్షణలో క్లూస్‌టీమ్, సీసీఎస్ సహకారంతో ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, సిబ్బంది, దర్యాప్తు చేపట్టారు. అనకాపల్లి జిల్లా కొండపాలెం అగ్రహారానికి చెందిన మాదిరెడ్డి రామానాయుడు (ప్రస్తుతం రాజవోలు గ్రామంలో ఉంటున్నాడు), హుకుంపేట డి-బ్లాక్‌కు చెందిన కోరుబిల్లి నాగరాజు ఎలియాస్ ఆర్యలను హుకుంపేటలోని డి-మార్ట్ సమీపాన శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.43 వేల నగదు, రూ.15 లక్షల విలువైన 200 గ్రాముల బంగారు, 2 కేజీల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండుకు తరలించనున్నారు. నిందితులను అరెస్టు చేసి, భారీగా సొత్తు రికవరీ చేసిన ఇన్‌స్పెక్టర్ విజయకుమార్‌ను, సిబ్బందిని ఎస్పీ సుధీర్ కుమార్‌రెడ్డి అభినందించారు.

‘మార్గదర్శి’లో సీఐడీ సోదాలు

అమలాపురం టౌన్: డిపాజిట్ల సేకరణలో అక్రమాల ఆరోపణలపై మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సీఐడీ సోదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాజమహేంద్రవరం, విశాఖపట్నం నుంచి వచ్చిన సీబీసీఐడీ ఎనిమిది మంది అధికారులు అమలాపురం బ్రాంచిలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ సోదాలు చేశారు. డిపాజిట్ల సేకరణకు సంబంధించిన రికార్డులను ఆద్యంతం పరిశీలించారు. కంప్యూటర్లలో నిక్షిప్తమై ఉన్న డిపాజిటర్ల సమాచారం కూడా సేకరించారు. ఎవరి నుంచి ఎంతెంత మేర డిపాజిట్లు సేకరించారు.. ఎంత కాలం నుంచి డిపాజిట్లు చేస్తున్నారు తదితర అంశాలపై లోతుగా ఆరా తీశారు. సిబ్బందిని కార్యాలయంలోనే ఉంచి, పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టేందుకు సీఐడీ అధికారులు ప్రయత్నించారు. వారు పూర్తి స్థాయి సమాచారం ఇవ్వలేదని, అడిగిన ప్రశ్నలకు డొంక తిరుగుడు సమాధానాలు చెప్పారని తెలిసింది. అమలాపురం మార్గదర్శి బ్రాంచిలో మరో రెండు రోజుల పాటు సీఐడీ సోదాలు కొనసాగనున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, మండపేటలోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయంలో కూడా సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించారు.

5న కొవ్వూరులో సీఎం బహిరంగ సభ



కొవ్వూరులో సీఎం సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్

- వలంటీర్లకు వందనం కార్యక్రమం
- పర్యటనపై కలెక్టర్ సమీక్ష

కొవ్వూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే నెల 5న కొవ్వూరులో నిర్వహించే వలంటీర్లకు వందనం రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. పట్టణంలో సభా ప్రాంగణం, హెలిప్యాడ్, రోడ్డు షోకు సంబంధిత ఏర్పాట్లను శనివారం ఆమె పరిశీలించారు. సీఎం పర్యటన, ఏర్పాట్లపై జిల్లా అధికారులతో ఆర్‌డీఓ కార్యాలయంలో సమీక్షించారు. సీఎం పర్యటనను అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో విజయవంతం చేయాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వలంటీర్లకు ఆ రోజు అవార్డులు ప్రదానం చేస్తారని చెప్పారు. వేసవి దృష్ట్యా బహిరంగ సభకు వచ్చేవారికి తాగునీటి, భోజన వసతి కల్పించాలని, ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాల వారీగా ముందస్తు రూటు మ్యాప్‌లు సిద్ధం చేయాలన్నారు. బైపాస్ రోడ్డులో బుద్ధుని విగ్రహం జంక్షన్ సమీపాన హెలిప్యాడ్ ఏర్పాటు చేశామన్నారు. బస్టాండ్ మీదుగా సభా స్థలి వరకూ 2.1 కిలోమీటర్ల పొడవున సీఎం రోడ్డు షో నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. వేసవి నేపథ్యంలో సభాస్థలి వద్ద 108 అంబులెన్సులను సిద్ధంగా ఉంచుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.నరసింహులు, ఆర్‌డీఓలు ఎస్.మల్లిబాబు, ఎ.చైత్రవర్షిణి, డీసీహెచ్ఎస్ ఎం.సనత్‌కుమారి, డీపీఓ పి.జగదాంబ, సీపీఓ కె.ప్రకాశరావు, డ్వామా పీడీ జీఎస్ రామ్‌గోపాల్ పాల్గొన్నారు.